


# స్త్రీవాదం కోసమే కథారచన చేపట్టాను!

**- ఓల్గా**


పోపూరి లలిత కుమారి అంటే తెలియదంటారేమో కానీ 'ఓల్గా' అనగానే తెలియని వారు ఉండరు. సాధారణంగా రచయిత తాను సృజించిన సాహిత్యానికి మాత్రమే బాధ్యత వహిస్తారు. కానీ ఓల్గా మాత్రం స్త్రీవాద సాహిత్య బాధ్యతనంతా వహిస్తున్నారు. స్త్రీవాద భావజాల ప్రతినిధిగానేగాక రచయిత్రిగా కూడా తనదైన ముద్రను సాధించారు ఓల్గా. 'శత వసంతాల తెలుగు కథ' ప్రయాణంలో ఆమె పాత్ర విస్మరించలేనిది. ఆమెతో ఇంటర్వ్యూ ఈవారం మీకోసం!!

## చదువుకి నిర్బంధం లేదు!

మా నాన్న వెంకట సుబ్బారావు, అమ్మ సుబ్బమ్మ. వాళ్ళిద్దరి పేర్ల లాగే వాళ్ల దాంపత్యమూ పాలూనీళ్ళలా కలిసి సాగింది. నాకొక అక్క, ఇద్దరు తమ్ముళ్లు. నాన్న కమ్యూనిస్ట్ భావజాలాన్ని ఒంటబట్టించుకున్న వ్యక్తి కావటంతో మా ఇంట్లో అదే వాతావరణం ఉండేది. సోవియెట్ సాహిత్యం, బోలెడన్ని పత్రికలు ఇంటికి వచ్చేవి. అవిగాక మంచి పుస్త కాలు ఇంటి నిండా ఉండేవి. వాటన్నిటి గురించి వివరిస్తూ చదవమని చెప్పేవారు నాన్న. అందువల్ల బాగా చదవడం నాకలవాటయింది. అదీ చాలా చిన్నప్పట్నుంచే. 'ఇది చదువు, అది వద్దు' అనే తరహా నిర్బంధా లేమీ ఉండేవి కాదు. అలాగే క్లాసు పుస్తకాలకూ వేరే వాటికీ లంకేమీ ఉండేది కాదు. రెండు చదువులూ అలా నడిచిపోయేవి. చాలా స్వేచ్ఛగా సాగేది నా చదువుకునే అలవాటు. ఒక్కసారి మాత్రం కాస్త భిన్నంగా జరి గింది. నాకేమో డిటెక్టివ్ నవలలంటే కొంచెం ఇష్టంగా ఉండేది: వాటిని నాన్నకు తెలియకుండా చదివేదాన్ని. ఒకసారి చదువుతుండగా నాన్న చూసి అన్నీ పట్టుకెళ్ళి కాల్చేశారు! చందమామ ఇష్టంగా ఉండేది. కథలకు ఒరవడి పెట్టిందా పత్రిక. సోవియెట్ యూనియన్ నుంచి వచ్చే సాహిత్యం చది వేదాన్ని. టాల్‌స్టాయ్, చెకోవ్, తుర్గనేవ్ వంటి రచయితలు అలా పరిచయమ య్యారు. శ్రీశ్రీ, చలం, కొకు, మాలతీచందూర్, రంగనాయకమ్మ, వాసిరెడ్డి సీతాదేవి... వీళ్లని ఇష్టంగా చదివాను. విశ్వనాథ, అడవి బాపిరాజు, ద్వివేదుల విశాలాక్షి, యద్దనపూడి సులోచనారాణి.. ఒకరని లేదు. అందరి రచనలూ చది వేదాన్ని. సహజంగానే ఒక వయసొచ్చాక నేను పల్ప్ మానేసి సీరియస్ రీడింగ్ మొదలెట్టాను. దొరికినవన్నీ చదివే సమయం లేకపోవడం వల్ల ఎంచుకుని మంచివి చదవడం ప్రారంభించాను.

## అందని పిహెచ్‌డి!!

నేను డాక్టరవ్వాలని నాన్న కోరిక. నేనేమో గుంటూరు ఏసీ కాలేజీలో బియ్యేలో చేరాను. అప్పటిదాకా చదివిన సాహిత్యం ఆ కోరిక కలిగించింది. దానికితోడు ఏసీ కాలేజీలో ప్రముఖ కవి కరుణశ్రీ తెలుగు పాఠాలు చెప్పే వారు. టి.జె. థామస్ అనే మరొకాయన ఇంగ్లీష్ చెప్పేవారు. ఆ సబ్జెక్ట్స్ బోధిం చడంలో వాళ్ళంతటివారు లేరు. అందువల్ల అవి చదువుకోవాలని నా కోరిక. మెడిసిన్ వదిలేసి బియ్యేలో చేరడం పెద్ద విషయమే! అయినా మా నాన్నగారు నన్నేమీ అనలేదు. నా ఇష్టాన్ని గౌరవించారాయన. అలా నేను తెలుగు సాహిత్యం, ఇంగ్లీష్ సాహిత్యం, చరిత్ర ప్రధానాంశాలుగా డిగ్రీ చేశాను. తర్వాత గుంటూరు పీజీ సెంటర్లో ఎమ్మే చేశాను. అప్పటికే విద్యార్థి ఉద్యమా లతో పరిచయం ఏర్పడింది. చురుగ్గా వాటిలో పాల్గొనేదాన్ని. పీజీలో ఒక ప్రొఫెసర్‌తో యుద్ధాలు చేయాల్సి వచ్చింది. నా అదృష్టం కొద్దీ ఆయనకా సంవ త్సరం ఎగ్జామినర్‌షిప్ లేకపోవడంతో ఫస్ట్‌క్లాస్‌లో పాసయ్యాను. తర్వాత కొడ వటిగంటి రచనల మీద పీహెచ్‌డీ చేశాను. గైడ్ పద్ధతులు నచ్చక తిరుగు బాటు చేశాను.. ఫలితం – పీహెచ్‌డీ నా చేతికి రాలేదు! (నవ్వు)



వాసిరెడ్డి సీతాదేవి, మాలతీ చందూర్‌తో...

## ఉద్యమాల బాట

డిగ్రీ నాటికే ఉద్యమాల బాటపట్టాను. పెరిగిన వాతావరణ ప్రభావం అలాంటిది. అదీగాక అది ఉద్యమాల యుగం. విప్లవాల కాలం. 67-70 నా డిగ్రీ. అప్పుడే ఎస్ఎఫ్ఐ ఆ తర్వాత ఎమ్ఎల్ పార్టీ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొన్నాను. శ్రీకాకుళ ఉద్యమం, విరసం, జనసాహితి ఇలా పనిచేస్తూ వచ్చాను. వాటిలో ఉన్నప్పుడే స్త్రీవాద ఉద్యమానికి బీజం పడిందని చెప్పుకో వచ్చు. పని చేసే క్రమంలో స్త్రీల సమస్యలు ముందుకొచ్చేవి. వాటి గురించి తీవ్రంగా చర్చించేవాళ్ళం. అయితే విప్లవపంథాలో చురుగ్గా ఉన్నవారు సైతం మహిళల సమస్యల మీద పెద్దగా దృష్టిపెట్టేవారు కాదు. పైగా వాటిపట్ల ఒక విధమైన నిరాసక్తత ఉండేది. విప్లవానంతరం తాము ఆశిస్తున్నలాంటి రాజ్యం ఏర్పడితే అందరి సమస్యలూ తొలగిపోతాయి కాబట్టి ఇప్పుడు స్త్రీలను ప్రత్యేక అస్తిత్వంగా గుర్తించడం ప్రధాన లక్ష్యానికి, కార్యకలాపాలకు విఘ్నం కలిగిస్తుం దని భావించేవారంతా. ఆ వాదనతో ఏకీభవించలేకపోయేదాన్ని. ఆ ధోరణితో విసిగిపోయిన నాకు స్త్రీవాద రాజకీయాలు కొత్త ఊపిరిని, నావైన దృష్టినీ ఇచ్చాయి. నేను ఫెమినిస్టునని, సోషలిస్టు ఫెమినిస్టుననీ గర్వంగా చెప్పుకుం టాను.

## బరువు బాధ్యతలు

తొలి సంవత్సరాలలో స్త్రీవాద సిద్ధాంతాన్ని తెలుగులో పరిచయం చేసే



చలంతో....

### నచ్చినవి

| | | |
|---|---|---|
| కథ | : | కురూపి (కొడవటిగంటి కుటుంబరావు) |
| నవల | : | జీవితాదర్శం (చలం) |
| కవి | : | శ్రీశ్రీ |
| రచయిత | : | కొడవటిగంటి కుటుంబరావు |
| సినిమా | : | మాయాబజార్ |
| నటుడు | : | గుమ్మడి |
| నటి | : | సావిత్రి |
| గాయని | : | ఎస్. జానకి |
| గాయకుడు | : | ఘంటసాల |
| బంధువు | : | ఆనందవాణి (మరదలు) |
| స్నేహితుడు | : | కీ.శే. సి.వి. సుబ్బారావు |
| వంట | : | పులిహోర |

బాధ్యత తీసుకున్నాను. దానిలో భాగంగా ఏర్పడిందే ఫెమినిస్ట్ స్టడీ సర్కిల్. తర్వాత సాహిత్యం ద్వారా, రచనల ద్వారా ఆ భావజాలాన్ని ఎక్కువమం దికి చేరవెయ్యగలనని అనిపించింది. అదే చేశాను. అసలు నేను కథల కోసం కథలు రాసే రచయిత్రిని కాను. స్త్రీవాద రాజకీయ చైతన్యాన్ని సాహిత్య రూపంలో అందించడానికి కథారచనను ఒక మార్గంగా ఎంచుకున్నాను. ఒక లక్ష్యం కోసం శ్రమ పడటంలో ఆనందం ఉంది. అదే ముందుండి తర్వాత నన్ను నడిపించింది.

## స్నేహమేరా జీవితం!

నా స్నేహితులు చాలా మంచి మనుషులు. వివిధ దశల్లో వారు నాకు కష్టం తెలీకుండా చూసుకున్నారు. నాకు అండగా, సాయంగా నిలబడ్డారు. వాళ్ళు లేకపోతే ఎలా ఉండేదాన్నో. సాహిత్యమూ అంతే. ఎంతో బలాన్నీ ధైరాన్ని ఇచ్చింది. సాహిత్యాన్ని చదవకపోతే ఇవాళున్నట్టు మాత్రం ఉండే దాన్ని కాదు. అలాగే నా రచనలు చదివి పాఠకులుగా పరిచయమైనవారు కొందరు నాకు దగ్గరి స్నేహితులయ్యారు. ఫెమినిస్టు రాజకీయాలు, సాహిత్యం, స్నేహితులు, సినిమాలు.. ఇదే నా జీవితం. నా పిల్లలు, సహచ రుడు కుటుంబరావు కూడా నా స్నేహితుల్లో భాగమే.

## తొలి రచన


పదహారేళ్ల వయసులో నా తొలి రచన అచ్చులో చూసుకున్నాను. రచనా ప్రక్రియ ఎవరిదయినా కాలేజీ మ్యాగజీన్లనుంచే మొదలవుతుందనుకుంటాను. నాదీ అంతే! 72లో 'జైలుగది ఆత్మకథ' అప్పటి సృజన పత్రికలో ప్రచురితమ యింది. 'రాజకీయ కథలు' తెలుగు సాహిత్యంలో కొత్త చూపుని అందించిన కథలని అనుకుంటాను. స్త్రీల శరీర రాజకీయాలను చర్చకు పెట్టాయవి. 'స్వేచ్ఛ' నవల స్త్రీల పౌరసత్వ భావనను చర్చకు పెట్టింది. ప్రయోగం, భిన్న సందర్భాలు కథా సంకలనాలు పునరుత్పత్తి, నిర్ణయాధికారాల గురించి ఆలోచింపచేస్తాయి. 'అతడు – ఆమె – మనం' స్త్రీవాద సాహిత్య విమర్శలో మొదటి అడుగు అను కుంటాను. వసంత, కల్పనలతో కలిసి చేసిన పరిశోధన 'మహిళావరణం' చూస్తే నాకు సంతోషం.

## అక్క పేరే నా పేరు!


నాకొక అక్క ఉందని చెప్పానుకదా, ఆమె పేరే ఓల్గా. అది రష్యన్ పేరు. అక్క పుట్టిన రోజే ఓల్గా అనే అమ్మాయి పోరాటంలో మరణించినట్టు నాన్నకు వార్తల్లో తెలిసిందట. ఆమె గుర్తుగా అక్కకు ఆ పేరు పెట్టారు. నాకు పదహారే ళ్లున్నప్పుడు అక్క చనిపోయింది. దాంతో నేను 'ఓల్గా'ను కలం పేరుగా పెట్టు కున్నాను.

## ఉద్యోగపర్వం

చేసిన ఉద్యోగాలన్నీ రచనకు దోహదం చేసినవే కావడం యాదృచ్ఛికం.



చేరా, ఉన్నవ లక్ష్మీనారాయణ తదితరులతో...



సహచరుడు కుటుంబరావుతో

తెనాలి వీఎస్సార్ కాలేజీలో లెక్చరర్‌గా పదమూడేళ్లు పని చేశాను. తర్వాత హైదరాబాద్ ఉషాకిరణ్ మూవీస్ స్క్రిప్ట్ డిపార్ట్‌మెంట్ హెడ్‌గా తొమ్మిదేళ్లు పని చేశాను. తర్వాత వసంత కన్నబిరాన్, కల్పన కన్నబిరాన్‌లతో కలిసి అస్మితను ప్రారంభించాం. గత ఏడాది వనిత టీవీ ఛానెల్ హెడ్‌గా పనిచేశాను. అన్ని ఉద్యోగాలనూ ఇష్టపడి ఆనందంగా చేశాను. వాటి ద్వారా ఎంతో నేర్చుకు న్నాను.

## రచనంటేనే ఇష్టం

పూణే ఇన్‌స్టిట్యూట్‌లో ఫిల్మ్ అప్రీసియేషన్ కోర్స్ చేశాను. 86 నుంచి ఫిల్మ్ ఫెస్టివల్స్‌కు హాజరవుతున్నాను. నా రచనల్ని కొన్నిటిని సినిమాలుగా మలిచాం. భద్రం కొడుకో, పాతనగరంలో పసివాడు, అమూల్యం, తోడు, గులాబీలు వంటివాటికి కోడైరెక్టరుగా, స్క్రిప్ట్ రాయటంలోనూ పనిచేశాను. అయితే షూటింగ్ వాతావరణాన్ని పెద్దగా ఎంజాయ్ చెయ్యలేదు. అక్కడెం దుకో స్వేచ్ఛ లేదనిపించింది. అవరోధాల మధ్య పనిచెయ్యడం నావల్ల కాదు. అదే రచనలో హద్దులుండవు. హాయిగా రాసుకోవడమే. అందుకే రచనంటేనే ఇష్టం.

## నీలి మేఘాలు

నీలిమేఘాలు రాకముందు స్త్రీవాద కవిత్వాన్ని ప్రగతిశీల రచయితలను కునే వాళ్లు కూడా దారుణంగా విమర్శించారు. నీలి కవిత్వమని, సామాజిక స్పృహ లేదు, శారీరక స్పృహ ఉందనీ విమర్శించారు. అప్పుడు అస్మిత రెండ్రో జుల సదస్సు ఒకటి నిర్వహించింది. భాషారాజకీయాలు, భావ రాజకీయాల గురించి బాగా చర్చించి, ఈ కవితలన్నిటినీ కలిపి సంకలనంగా తేవాలని నిర్ణ యించుకున్నాం. అదే నీలిమేఘాలు. పుస్తకం వచ్చింతర్వాత అడ్డగోలు విమ ర్శలు సద్దుమణిగాయి.. స్త్రీవాద రచనలకు ఒక గౌరవం ఏర్పడింది. ఆ రకంగా చూసినప్పుడు ఆ పుస్తకం తన లక్ష్యాన్ని తాను నెరవేర్చింది.

## ఈనాటి సాహిత్యం

కొత్త అస్తిత్వాలు కథా వస్తువులవుతున్నాయి. వస్తువైవిధ్యం ఉన్నంతగా శిల్పవైవిధ్యం కన్పించటంలేదు. కథ చెప్పే శైలిలో కొత్తదనం కోసం, కొత్త శిల్పం కోసం ఎక్కువమంది ప్రయత్నించటం లేదు. రెండోది : సాహిత్యంతో సంబంధం లేని ఒక వాతావరణంలో నేటి మెజారిటీ యువతరం ఉంది. ఇంకొక తరం పోతే తెలుగు పాఠకులు, రచయితలు, కవులు.. అందరూ ప్రమాదంలో పడతారేమో అనిపిస్తోంది. ఇలాంటి పరిస్థితిని ఎలా ఎదుర్కో వాలన్నది ఒక సవాలు.

★

నాకు నచ్చిన నా కథ

# తోడు

- ఓల్గా

సాయంత్రం ఐదు గంటలు దాటింది. ఆఫీసులో అందరూ వెళ్ళిపోయారని ప్యూను వచ్చి చెబితే తప్పనిసరై లేచాడు గంగాధరం. చలికాలం. నెమ్మదిగా చీకట్లు ముసురుకుంటున్నాయి. ఆ చీకట్లను చూస్తుంటే ఎక్కడలేని దిగులు మనసునిండా ముసురుకుంది గంగాధరానికి. బిక్కముఖంతో ఆ చీకట్లను చూస్తూ అలాగే నుంచున్నాడు.

'ఇంటికి ఎందుకెళ్ళాలి? ఇంట్లో దుమ్మూ, బూజూ తప్ప ఏముందని? తాళం తీసుకుని ఇంట్లోకి వెళ్లి ఒక్కడే కాఫీ పెట్టుకుని తాగడం అనే భయంకర క్షణాలను అనుభవించ డానికి పనిగట్టుకుని వెళ్ళటం ఎందుకు? ఆ కాఫీ ఏదో హోటల్లో సర్వర్ తెచ్చిపెడితే పది మంది మధ్యలో కూచుని తాగితే పోదూ!'

నెలరోజుల నుంచీ నడుస్తున్నట్లుగానే ఆ రోజు కూడా ఆఫీసు నుంచి హోటలుకు నడిచాడు.

సాయంత్రం వేళ. హోటలు కిటకిటలాడుతోంది. పది నిమిషాలపైన నిలబడితే గాని సీటు దొరకలేదు. అదైనా ఓ జంటకు ఎదురుగా ఉన్న సీటు. గంగాధరం వెళ్లి కూచుంటే వాళ్ళు ఇబ్బందిగా ముఖాలు పెట్టారు. 'కాళ్ళు పీకుతున్నాయి బాబూ. నేనేం చెయ్యలేను' అనుకుంటూ సీట్లో కూలబడి మంచినీళ్ళు తాగాడు. అప్పుడు చుట్టూచూశాడు అంతా హడావిడిగా ఉంది. ఆ కోలాహలాన్ని చూస్తున్న కొద్దీ గంగాధరం ఒంటరితనం పెరిగి పోయింది. తన కాయమంతటితో, కాలమంతటితో ఒంటరితనాన్ని పూర్తిగా అనుభవిస్తూ టిఫిన్ తిని కాఫీ తాగేశాడు. పార్కులో ఓ చెట్టు కింద రెండు గంటల కాలాన్ని ఆలోచనలకు ఆహుతిచ్చి మెల్లిగా ఇల్లు చేరాడు.

ఆరంతస్తుల అపార్ట్‌మెంట్‌లో మూడవ అంతస్తులో గంగాధరం ఫ్లాట్. 'ఇప్పుడు ఒక్క నిమిషంలో ఇంట్లో పడిపోయి ఏం బావుకోవాలి గనక' అనుకుని లిఫ్టువైపు వెళ్లకుండా మెట్లు లెక్కపెడుతూ యాభై మెట్లనూ మెల్లిగా ఎక్కాడు. ఇక తప్పదన్నట్లు తలుపు తాళం తీయబోతుంటే, పక్క ఇంట్లోంచి ఏడుపు వినపడింది.

ఏమయిందా అని అటువైపు హడావిడిగా నడిచాడు.

పక్కింట్లో జనం నిండుగా మూగి ఉన్నారు.

వాళ్ళందరినీ తోసుకుంటూ ముందుకెళ్ళాడు గంగాధరం.

ఆ ఇంటావిడ విజయలక్ష్మి ఏడుస్తోంది. కాసేపటికి చుట్టుపక్కల వాళ్ళవల్ల విషయం అర్థమయింది.

విజయలక్ష్మి భర్త రాఘవరావు స్కూటర్ ఆక్సిడెంటయి రోడ్డుమీద అప్పటికప్పుడు ప్రాణం విడిచాడట.

విజయలక్ష్మిని చూస్తే జాలేసింది గంగాధరానికి.

'ఈ ఫ్లాట్‌లలో వాళ్ళకేదో శని పట్టినట్లుందేమిటి? రెండు నెలల క్రితం తన భార్య సుశీల బ్లడ్ కాన్సర్‌తో మరణించింది. కాన్సర్ అని బైటపడ్డ నెలకే మరణించింది ఇప్పుడీ అఘాయిత్యం!'

విజయలక్ష్మిని చూస్తూ గంగాధరం చెమర్చిన కళ్ళు తుడుచుకున్నాడు.

ఇద్దరి ఇళ్ళూ పక్కపక్కనే కాదు. గంగాధరం కుటుంబానికీ, రాఘవరావు కుటుంబానికీ చాలా పోలికలున్నాయి. ఇద్దరిదీ ఇంచుమించు ఒకే వయసు. రాఘవరావు బ్యాంకు ఆఫీసరయితే, గంగాధరం ఎల్.ఐ.సిలో ఆఫీసరు. ఒకే హోదా, ఒకే జీతం. విజయలక్ష్మి ఒక ప్రైవేట్ స్కూల్లో టీచరుగా చేస్తుంటే, సుశీల ఒక ప్రైవేట్ కంపెనీలో పనిచేసేది. ఇద్దరూ రెండేళ్ళనాడు ఈ అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్స్ కొనుక్కున్నారు. గంగాధరం వెంటనే సొంత ఇంట్లో చేరాడు గానీ, రాఘవరావు ఏడాది పాటు అద్దెకిచ్చి పోయినేడాదే చేరాడు. ఈ సంవత్సరంలో రెండు కుటుంబాల మధ్య ఒక మాదిరి పరిచయం ఏర్పడింది. ఒకరి వివరాలు ఒకరికి తెలుసు. అత్యవసరమైన చిన్నచిన్న సాయాలు చేసుకునేవారు. ఆడవాళ్ళ మధ్య కూడా కాస్త స్నేహం కుదిరింది. తమ భర్తల దగ్గర అవతలివారిని విమర్శించకుండా రెండు మంచి మాటలు చెప్పగల సంస్కారం ఇద్దరిలోనూ ఉండడం వల్ల, ఒకరిని చూసి ఒకరు కపటం లేకుండా నవ్వుకునే వారు. ఇద్దరూ ఉద్యోగస్తులవటంతో స్నేహం పెరగటానికి కావలసినంత ఖాళీ దొరకలేదు. పైగా, సుశీల అనారోగ్యం. రాఘవరావుకి ఇద్దరు కొడుకులు. ఒకడు బెంగుళూరులో, మరొకడు త్రివేండ్రంలో ఉద్యోగాలు చేస్తున్నారు. ఇద్దరికీ పెళ్ళిళ్ళయ్యాయి. పిల్లలు కూడా ఉన్నారు. గంగాధరానికి ఒక కూతురు, ఇద్దరు కొడుకులు. ఇద్దరు కొడుకులు మంచి ఉద్యోగాల్లో స్థిరపడి పెళ్ళిళ్ళు చేసుకున్నారు. కూతురు శ్యామలకు కూడా పోయినేడాది పెళ్లి చేసాడు. గంగాధరానికి ఇంకా మనవలూ, మనవరాళ్లూ లేరు. ఇద్దరికీ ఇంకో నాలుగేళ్ళ సర్వీసుంది. ఇంతలో రాఘవరావుకు ఇలా మృత్యువు ముంచుకొచ్చింది.

విజయలక్ష్మి పరిస్థితి చూస్తే గంగాధరానికి చాలా దిగులనిపించింది. ఒంటరి బతుకు ఎంత కష్టమో అతనికి అనుభవంలో తెలుస్తూనే ఉంది.

'తను మగాడు కాబట్టి ఎలాగో నెట్టుకొస్తున్నాడు. పాపం, ఆడది ఒంటరిగా ఎలా నెగ్గుకు రాగలదు? మగాడైనా తనకెంత దుర్భరంగా ఉందీ ఒంటరితనం? పిల్లలు ఈ నాలుగేళ్ళూ సెలవు పెట్టిగానీ, వెంటనే రిటైరైగానీ తమ దగ్గరకు రమ్మంటారు గానీ తనకిష్టం లేదు. వెళ్ళాక నాలుగు నెలలు గడవగానే ఆ కోడళ్ళు ఈ ముసలాయనకు ఎన్నాళ్ళూ చేయాలా సేవలన్నట్లు చూస్తారు. తప్పదు. అది మానవస్వభావం. వాళ్ళను తప్పు పట్టటం కాదు. ఊరికే పనీపాటూ లేకుండా కూచుంటే తోచి చావదు. సుశీల గుర్తొచ్చి ఏడుపొస్తోంది. అస్తమానం ఏడుపు ముఖంతో కూచునే తనను కోడళ్ళు ఎంతకాలమని ఆదరంగా, ప్రేమగా చూడగలరు. అది జరిగే పని కాదు' అనుకుని ఉద్యోగం చేస్తూనే ఉన్నాడు గంగాధరం.

'ఇప్పుడీవిడ పిల్లల దగ్గరకు వెళ్లిపోతుంది కాబోలు. ప్రైవేటు స్కూల్లో ఉద్యోగం వాలంటరీ రిటైర్మెంటు కుదరదు. వదిలేసుకు వెళ్ళాల్సిందే' జాలిగా చూశాడు. విజయలక్ష్మి ఏడుపు ఎంతకూ ఆగటం లేదు. పిల్లలు వచ్చేసరికి తెల్లవారిపోతుంది. జనం నెమ్మదిగా తమ తమ పనులకు వెళ్ళిపోతున్నారు. చివరికి బాగా సన్నిహితులు పదిమంది మిగిలారు. వాళ్ళతో ఆ మాట ఈ మాటా మాట్లాడి నడుం నొప్పెస్తుంటే లేచి తన ఇంట్లోకి వచ్చేశాడు గంగాధరం. రెండు నిద్ర మాత్రలు వేసుకుని పడుకున్నాడు.

పదిహేను రోజులు గడిచాయి. రాఘవరావు పిల్లల్ని ఒకసారి పలకరించడం మినహా గంగాధరం మళ్ళీ వాళ్ళింటికి వెళ్ళలేదు. ఆరోజు రాఘవరావుకు పెద్దకర్మ చేశారు. గంగాధరాన్ని కూడా పిల్చారు. అతను వెళ్ళేసరికి చివరి బంతిలేస్తోంది. రాఘవరావు పెద్ద కొడుకు అశోక్‌తో మాట్లాడుతూ గంగాధరం ఒక్కడే ప్రత్యేకంగా భోజనం చేశాడు. రాఘవరావు ఇన్సూరెన్సు డబ్బు సాధ్యమైనంత త్వరగా వచ్చేలా చేస్తానని మాటిచ్చాడు.

భోజనం పూర్తయ్యాక హాల్లోకి వచ్చి కూర్చుంటే అశోక్ 'అమ్మా' అంటూ విజయలక్ష్మిని పిల్చాడు. విజయలక్ష్మి వచ్చింది.

ముందు విజయలక్ష్మిని తలెత్తి చూడటానికి భయపడ్డాడు గంగాధరం బొట్టూ అదీ తీసేసి ఎలాగో ఉంటుందనుకున్నాడు. తీరా చూసి ఆశ్చర్యపోయాడు.

విజయలక్ష్మిలో ఏ మార్పులేదు. బొట్టూ అలాగే ఉంది. మెళ్ళో ఎప్పుడూ ఉన్నట్లే బంగారు గొలుసూ, నల్లపూసలు గొలుసూ, చేతికి ఎర్రటి గాజులు - అంతా మామూలు గానే ఉంది.

గంగాధరం ఎందుకోగానీ పెద్ద నిట్టూర్పు విడిచాడు.

"మా అమ్మని మాతో రమ్మంటే రానంటోందండి'' అన్నాడు అశోక్.

చిన్నకొడుకు ప్రసాద్ కూడా వచ్చి కూచున్నాడు.

"ఇప్పుడు సెలవుపెడితే స్కూల్లో పిల్లలకు ఇబ్బంది కదండీ. మరో నాలుగు నెలల్లో వేసవిసెలవులు రానే వస్తాయి. అప్పుడు వస్తానంటున్నానండి. ఏదో ఓ పనిలో పడి దిగులు మర్చిపోవాలిగానీ, అక్కడికెళ్ళి తీరిగ్గా కూచుని ఏడవటం మంచిదంటారా'' అంది విజయలక్ష్మి.

"ఔను తీరిక మంచిదికాదు. నేను అనుభవం మీద చెబుతున్నాను. మీ అమ్మకు ఎలా ఇష్టంగా ఉంటే అలాగే ఉండనివ్వండి'' అన్నాడు గంగాధరం.

విజయలక్ష్మి కూడా పిల్లలదగ్గరకు వెళ్ళకపోవడంతో తన నిర్ణయం మంచిదై నట్లూ, దానికి బలం వచ్చినట్లూ అనిపించింది గంగాధరానికి.

పదిరోజుల తర్వాత విజయలక్ష్మి కొడుకు లిద్దరూ కుటుంబ సమేతంగా వెళ్ళి పోయారు.

విజయలక్ష్మి ఒంటరితనాన్ని ఎలా ఎదుర్కొంటుందో చూడాలన్న ఆరాటంతో పది రోజులుగా రోజూ పెందలాడే ఇంటికి వస్తున్నాడు గంగాధరం. తనలాగే ఒక్కతే బాల్కనీలో లైటన్నా వేసుకోకుండా కూర్చుండి పోతుందేమోననుకున్నాడు. విజయలక్ష్మి బాల్కనీలోకి యథాలాపంగా వచ్చి వెళ్ళేదే గాని కూచునేది కాదు. ఇంటికి ఎవరూ స్నేహితులన్నా వస్తున్నట్లు లేరు. 'ఎలా కాలక్షేపం చేస్తోందీవిడ' అనుకున్నాడు.

ఒకరోజు ఉదయాన్నే వెళ్ళి "ఏమన్నా సాయం కావాలంటే మొహమాటం లేకుండా అడగండి'' అని చెప్పి వచ్చాడు.

కానీ, తర్వాత పదిహేను రోజులు గడిచినా విజయలక్ష్మి ఏమీ అడగలేదు.

ఆరోజు విజయలక్ష్మి ఫ్లాట్ దాటి తన ఫ్లాట్‌కి వస్తుంటే లోపల్నించి సంగీతం లాంటిదేదో వినపడింది.

పిల్లలుగాని వచ్చారా అనుకుని కాలింగ్ బెల్ నొక్కాడు. విజయలక్ష్మి తలుపు తీసింది.

"రండి రండి'' అని ఆహ్వానించింది.

"ఏం చేస్తున్నారు?'' అడిగాడు గంగాధరం. ఓ పక్కగా పరిచిన చాపమీద కొత్తగా మెరుస్తున్న వయొలిన్ చూస్తూ.

"చిన్నప్పుడు నేర్చుకున్న సంగీతం ఎంతవరకు జ్ఞాపకం ఉందో చూస్తున్నాను. ఇవాళే కొనుక్కొచ్చానిది. రేపటి నుంచీ సంగీతం క్లాసులకు వెళ్దామని'' నవ్వుతూ వయొలిన్ చేతికిచ్చింది.

దాన్ని ఎలా పట్టుకోవాలో కూడా తెలియని గంగాధరం వెంటనే తిరిగిచ్చేశాడు, చంటి పిల్లాడిని ఎత్తుకోవడం చేతకాని వాడు తల్లికి తిరిగి ఇచ్చేసినట్లుగా.



"మంచినీళ్లు తాగుతారా'' అంటూ తీసుకురావటానికి లోపలకు వెళ్ళింది. హాలంతా పరికించాడు గంగాధరం. ఎక్కడా ఏ మార్పూ లేదు. రాఘవరావు ఉన్నప్పుడెలా ఉందో ఇప్పుడూ అలాగే ఉంది – అందంగా, పరిశుభ్రంగా.

గాజుగ్లాసులో మంచినీళ్ళతో పాటు చిన్నప్లేటులో టిఫిను కూడా తెచ్చింది. టిఫిన్ తింటూ కుశల ప్రశ్నలు వేశాడు. మళ్ళీ ఇంకోసారి ఏ సాయం కావాలన్నా అడగమని చెప్పారు. కానీ, అతనికి తెలుస్తూనే ఉంది. సాయం కావాల్సింది ఆమెకు కాదు, తనకే నని.

టిఫిన్ తిని చేతులు కడుక్కునే నెపంతో వంటింట్లోకి వెళ్ళాడు. వంటిల్లు కూడా శుభ్రంగా, ఏ లోపం లేకుండా ఉంది. 'ఈమె జీవితంలో ఏ లోటూ లేదా? రాఘవరావు మరణం వల్ల ఈమె జీవితంలో ఏ మార్పురాలేదా? సుశీల మరణంతో తన జీవితం తలక్రిందులై పోయిందే – రాఘవరావు మీద ఈమెకేం ప్రేమ లేదా? అనుమానించాడు.

కానీ, హాల్లో రాఘవరావు ఫొటోకి అప్పుడే తెచ్చివేసినట్లున్న విరజాజి పూల

దండ – ఫొటో ఎదురుగా వాజ్‌లో అమర్చిన తాజాపూలు, అతని వస్తువులన్నీ జాగ్రత్తగా దాచిన తీరూ చూస్తుంటే ప్రేమలేదని అనుకోలేక పోయాడు. తన ఇంట్లో సుశీల ఫొటో దుమ్ము కొట్టుకు పోయి ఉంది మరి! 'ఎక్కడుంది తేడా? ఆడ మనిషి భర్తపోతే అనాథగా అలమటించాల్సింది పోయి నవ్వుతూ, తిరుగుతూ సంగీతం నేర్చుకుంటోంది. ఇల్లు ఎప్పటిలాగే చక్కదిద్దుకుంటోంది.

తను మగరాయుడు – ఇలా దిక్కూ మొక్కూ లేక ఇల్లు అరణ్యంలా తయారై. తిండికి ముఖం వాచి, ఆలనా పాలనా లేక అఘోరిస్తున్నాడు. తన ఇల్లు ఇలా ఉండ టానికి కారణం సుశీల మీద దిగులా లేక ఆ పనులు చేతగాని అసమర్థతా?

ఇవాళ పొద్దున్నే గుండీ ఊడని చొక్కాకోసం బీరువా అంతా గాలిస్తే ఒక్కటీ కనపడలేదు. ఎలాగో చివరి గుండీ ఊడిన చొక్కా వెతుక్కుని, గుండుసూది ఒకటి సంపాదించి పెట్టుకున్నాడు.

గుండీలు కుట్టాలని తను ఎప్పుడూ చొక్కాలు కుట్టించుకునే టైలర్ దగ్గరకు చొక్కాలన్నీ తీసుకెళ్లాడు. అతన్నేదో తను మహాహీనమైన పని చేయమన్నట్టుగా ముఖం పెట్టి ''కుదరదు సార్'' అన్నాడు. అలాంటి షాపుల్లో గుండీలు ఊడితే, కుట్లు ఊడితే రిపేర్లు చేసి పెట్టరట. ఎక్కడ చేస్తారో కనుక్కోవాలి. చొక్కాలన్నీ మళ్ళీ ఇంటికి మోసుకొచ్చాడు.

ఇది జరుగుతున్నంత సేపూ సుశీల గురించి దిగులుపడుతూనే ఉన్నాడు. 'తనకు గుండీలు కుట్టడం వచ్చుంటే ఇవాళ సుశీలను అంతసేపు తల్చుకునే వాడు కాదా? ఈవిడకు దిగులు లేకపోవడానికి ఈవిడకున్న సమర్థతే కారణమా? ఆడవా ళ్ళంతా అంతేనా?'.

ఆలోచించగా ఆలోచించగా ఆర్థికంగా ఇబ్బందులు లేని ఆడవాళ్ళు భర్త చని పోయినా, భార్య చనిపోయినా మగవాళ్ళంతా అనాథలు కారనిపించింది.

'వాళ్ళబతుకు వాళ్ళు బతుకగలరు. మగవాళ్ళలా రోజువారీ జీవితంలో పరా



ధీనులుగా బతక్కపోవటం వల్ల వాళ్ళ జీవితంలో తేడా రాదు. పైగా, పని తగ్గి సుఖపడతారు. అనుకున్నాడు.

సుశీల ఉండగా ఎంత సుఖం తనకు!

లేచేసరికి కాఫీ.

స్నానం చేసి వచ్చేసరికి వేడి వేడిగా భోజనం.

మధ్యాహ్నం సుష్టుగా టిఫిను.

ఆఫీసులో ఎవరిమీద కోపం వచ్చినా సుశీల దగ్గర తిడితే తగ్గిపోయేది. సుశీల ఎవరి తోనూ చెప్పదని నిశ్చింతతో తిట్టి బి.పి. తగ్గించుకునే వాడు. రాత్రి పూట కాళ్ళు పీకుతుంటే విసుక్కోకుండా పట్టేది.

అన్నిటికీ సుశీల మీద ఆధారపడే వాడు. తనని అన్యాయం చేసిపోయింది.

ఏడుపొచ్చింది గంగాధరానికి.

ఆ ఏడుపులోనే ఏడుస్తోంది తన కోసమేనని సుశీల కోసం కాదేమో అనిపించింది.

'తన కష్టాలకు తనేడుస్తున్నాడా? సుశీల చచ్చిసుఖపడుతోందా? ఆడవాళ్ళు తాము చచ్చిపోతే స్వర్గంలోనూ, భూమ్మీదా సుఖపడతారా?' తన పిచ్చి ఆలోచనలకు తన జుట్టు పీక్కుని గట్టిగా కళ్ళు మూసుకున్నాడు గంగాధరం.

మరో పదిరోజులకు మళ్ళీ విజయలక్ష్మిని పలకరించటానికి వెళ్ళి ఇదే విషయాన్ని అన్యాప దేశంగా ప్రస్తావించాడు.

''మీరు ఎలా తట్టుకుంటారో అని భయపడ్డాను. ఫరవాలేదు. ధైర్యంగానే ఉన్నారు'' అన్నాడు.

విజయలక్ష్మి ఏమీ మాట్లాడలేదు.

''సుశీల లేని నా పరిస్థితికి, రాఘవరావుగారు లేని మీ పరిస్థితికి చాలా తేడా ఉందని పిస్తోంది. మనిషి పోవటం, ఆ దిగులూ అవీ ఇద్దరికీ ఏ తేడా లేకుండా సమానమే అయినప్పటికీ...''

''సమానం కాదులెండి'' అంది విజయలక్ష్మి అతని మాటకు అడ్డు వస్తూ.

గంగాధరం ఆశ్చర్యంగా చూశాడు.


''మా ఆయన్ని నేను ప్రేమించటానికీ, మీ ఆవిడను మీరు ప్రేమించటానికీ చాలా తేడా ఉంది. మీ ఆవిడ మీకు కావాల్సిన సుఖాలూ, సేవలూ అందించింది. మీకు ఆమె లేక పోవడం పెద్దలోటు. బహుశా ఆ లోటు మీకు అనుక్షణం తెలుస్తూనే ఉంటుందను కుంటాను. దాంతో బాగా దిగులనిపిస్తుండవచ్చు. కానీ, మా ఆయన నాకేమంత సహకరించలేదు. ఆయనకు నేను సేవలు చేయడం తప్ప ఆయన నాకేం చేయలేదు. నా ఇష్టా లేమిటే, నా శక్తులేమిటో ఆయన ఎన్నడూ కనుక్కోలేదు. ఆయన ఇష్టాల్ని తీర్చు కోటానికీ, ఆయన శక్తుల్ని నిరూపించుకోటానికీ నేను ఆయనకు ఉపయోగపడ్డాను. ఆఖరికి తిండి విషయంలో కూడా ఆయన ఇష్టాలే చెల్లేవి. ఎందుకలా చేశానంటే – నాకలా అలవాటు చేశారు. చిన్నతనంలోనే పెళ్ళయింది. అప్పట్నుంచీ అంతే, అవతల మనిషి ఇబ్బంది పడుతుంటే, ముఖం మాడ్చుకుంటే నాకు బాగుండేది కాదు. అందులో జీవితాంతం కలసి బతకాల్సిన మనిషి. అందుకనీ అన్నీ ఆయనక్కావల్సినట్టే చేసేదాన్ని. నా ఇద్దరు కొడుకులూ ఆయన నోట్లోంచి ఊడిపడ్డారు. వాళ్ళని మార్చటం నా వల్ల కాలేదు. నామీదే ఆధారపడ్డారు. ముగ్గురు మగవాళ్ళూ నా మెడకు భుజాలకు పడి వేలాడుతున్నట్టే ఉండేది. పిల్లలు పెళ్ళయి వెళ్ళిపోయాక కాస్త విశ్రాంతి దొరికింది. ఈయన పోయాక నాకు జీవితం మిగిలింది. ఇప్పుడు నేను ఏం చేసినా అది నాకోసమే. నన్ను పట్టుకుని వేలాడే ఏ బరువులూ లేవు. నేను ఎటైనా తేలిక నడవగలుగుతున్నాను. ఇదిగో – ఈ సంగీతం మొదలు పెట్టాను''.

''ఆడవాళ్ళందరూ ఇలాగే అనుకుంటారా?''

గంగాధరానికి తను చచ్చిపోయి సుశీల బతికి ఉంటే తనను గురించి ఏమని చెప్పేదా అని అనుమానం వచ్చింది.

''ఏమో, నాకు తెలియదు. కొందరు తామే బరువుల్లా మగవాళ్ళకు వేలాడేబడే వాళ్ళుం టారేమో. కానీ, చాలా తక్కువనుకుంటాను. ఆడది మోసేబరువులు ఎవరికీ కనిపించవు. ఇంట్లో అందరికీ అన్నీ అమర్చిపెడుతూ చేసే చాకిరి, దానివల్ల అందరికీ దొరికే మానసికమైన శాంతీ – దీనికెవరూ విలువ కట్టలేరు. అందరి ఉద్రేకాలకు ఆనకట్టలా ఉంటూ, తమ తమ ఆవేశాలతో, బాధలతో అందరూ మీద పడటానికి ఒక ఆధారంగా ఉండే ఆడది చేసే పనీ, ఆ బరువూ మీకు అర్థం కాదు. చాలామంది ఆడవాళ్ళకు కూడా తామింత చేస్తున్నామని తెలియదు.'' ఆమె ఆపకుండా మాట్లాడుతోంది.

'ఈవిడిలా ఇంతాబాగా మాట్లాడగలదని ఇన్నాళ్ళూ తెలియదే' అనుకున్నాడు



గంగాధరం.

ఆవిడ టీచరన్న విషయం గుర్తొచ్చింది. 'అన్నీ విడమరిచి చెప్పటం అలవాటయి నట్లుంది' అనుకున్నాడు.

''ఇంతకూ నే చెప్పొచ్చేదేమిటంటే – 'అనాథ' అనే మాట భర్త చనిపోయిన ఆడవాళ్ళ విషయంలో నిజం కాదు. నిజమైన అనాథలు భార్యపోయిన మగ వాళ్ళే'' నవ్వింది విజయలక్ష్మి.

'నిజం' అనుకున్నాడు గంగాధరం.

'తన సంగతే చూడరాదు – రేపీవిడ పిల్లల దగ్గరకు వెళ్ళినా వాళ్ళకు సాయం చెయ్యగలదు. మనవల్ని పెంచగలదు. తాను బరువన్న స్పృహ వాళ్ళకు కలగ కుండా బతక గలదు. తనట్లా కాదు. తనో పెద్ద బరువు'.

ఆలోచనలో పడి విజయలక్ష్మి లోపలికి వెళ్ళడం చూడలేదు గంగాధరం.

పది నిమిషాల్లో ఆవిడ తిరిగొచ్చే వరకూ ఆలోచనల్లో కొట్టుకుపోతూనే ఉన్నాడు.

విజయలక్ష్మి అతని వాలకం చూసి ''ఏమిటి, నా మాటలు మిమ్మల్ని బాగా కలవర పెట్టినట్లున్నాయి'' అంది.

''అబ్బే, లేదు మరి నే వస్తాను'' అంటూ లేవబోయాడు.

''ఎక్కడికి వెళ్తారు? హోటలుకేగా! ఈ పూటకి మా ఇంట్లో భోజనం చేద్దురు గాని. మీ కోసం కూడా బియ్యం పడేసి వచ్చాను'' అంది.

మరో అరగంట కబుర్ల తర్వాత ఇద్దరూ భోజనం చేశారు. విజయలక్ష్మి చేతి వంట తింటుంటే, గంగాధరానికి చచ్చిన జిహ్వ బతికొచ్చింది.

సుశీల పోయిన తర్వాత ఇంత మంచి భోజనం చేయలేదు. తృప్తిగా తిన్నాడు. విజయలక్ష్మికి మరీ మరీ ధన్యవాదాలు చెప్పి తన ఇంటికి వెళ్లాడు.

ఇల్లంతా గందరగోళంగా ఉంది.

'ఆ పని మనిషికి ఎంతచెప్పు, ఇల్లు ఇలా చిందరవందరగానే ఉంచుతుంది. ఎక్కడి దుమ్ము అక్కడే ఉంటుంది. సుశీల ఎట్లా వేగిందో ఈ అమ్మాయితో, ఎక్కడా చిన్న దుమ్మూ మరకా లేకుండా ఉంచేది ఇల్లు. తన కట్లాంటి వాతావరణం కావాలి. అట్లా అలవాటయింది. కానీ, ఆ వాతావరణం ఏర్పరచుకోవడం చేత కాదు. ఛీ! ఛీ! బతుకు దుర్భరంగా ఉంది.' నిద్రమాత్రలు వేసుకోవడం తప్పలేదు గంగాధరానికి.

***

నాలుగైదు నెలలు గడిచే సరికి గంగాధరానికి, విజయలక్ష్మికీ మధ్య స్నేహం పెరిగింది. వారానికి రెండుసార్లు అక్కడే భోజనం చేస్తున్నాడు. అప్పుడప్పుడూ ఉదయం, సాయంత్రం టిఫిన్లు కూడా సేవిస్తున్నాడు. విజయలక్ష్మి నేర్చుకున్న సంగీతం కాస్త కాస్త ఆనందించ గలుగుతున్నాడు.

''మరింకేం – ఆవిడను పెళ్ళాడితే పోలా!''

''ఛీ – అదేంమాట'' అన్నాడు గానీ, గంగాధరానికి అదంత పాడుమాటగా అనిపించ లేదు.

రాను రానూ అది మంచి మాటేనేమో, ఒకవేళ చాలామంచి మాట కూడా నేమో అన్న సందేహం కలిగి, క్రమంగా స్థిరపడి నమ్మకం కూడా కుదిరింది.

మరో ఆరునెలలు గడిచాయి ఆలోచనలతో.

ఈలోపే సుశీల సంవత్సరీకం జరిపారు. పిల్లలు వచ్చారు. కూతురు ఇల్లంతా బాగు చేసింది. కొడుకు కావాల్సినవన్నీ కొనితెచ్చాడు. బంధువులు ఆ రోజుకి వచ్చారు. విజయలక్ష్మి తను చేయగలిగిన సహాయాలు చేసింది. గంగాధరం కూతురు విజయలక్ష్మి దగ్గరకొచ్చి–

''నేను వచ్చిన రోజు ఇల్లు వల్లకాడులా ఉంది. ఆ ఇంట్లో మా నాన్నను చూస్తుంటే ఎంత ఏడుపొచ్చిందో చెప్పలేను. మా దగ్గరికి రమ్మంటే రాడు. ఎలా బతుకుతాడో ఏమో'' అని కన్నీళ్ళు పెట్టుకుంది.

మరో రెండు నెలలకు విజయలక్ష్మి, రాఘవరావు ఏడూరు చేయించింది. ఇద్దరు కొడుకులు కోడళ్ళు, మనవలూ మనవరాళ్ళూ వచ్చారు. కొడుకులూ, కోడళ్ళూ ఇంటి పెత్తనం తీసుకుని పనులు చేస్తుంటే, విజయలక్ష్మి మనవలతో మన వరాళ్ళతో కాలక్షేపం చేసింది.

ఆ కార్యక్రమం కూడా అయిపోయింది.

పిల్లలు విజయలక్ష్మిని తమదగ్గరకు రమ్మని గంగాధరం సమక్షంలో మరోసారి బతిమాలారు. గంగాధరాన్ని హితవు చెప్పమని అడిగారు.

''ఆయనేం చెప్తారురా – ఆయన పిల్లలు ఆయన్ని బతిమాలి భంగపడి వెళ్ళి

## కథాంతరంగం



వివాహ వ్యవస్థలో నలిగిపోయి, భర్త మరణంతో దాన్నుంచి విముక్తి లభించగానే ప్రశాంతతను పొందిన ఆడవారెందరో నాకు తెలుసు. తనది కాని లోకంలో అన్నాళ్ళు బతికిన స్త్రీలు, అప్పుడిక మళ్ళీ విక సించటానికి ప్రయత్నించటమూ, ఆ ప్రయత్నంలో ఆనందం పొందటమూ చూశాన్నేను. అందరూ అనుకునేట్టు భర్త మరణంతో దిక్కుతోచకపోవడం ఉండదు. కొన్నిసార్లు దానివల్ల స్త్రీల జీవితం స్త్రీల చేతుల్లోకి వస్తుంది. ఈ ఆలోచనల ప్రతిబింబమే 'తోడు' కథ.

– ఓల్గా

సెల్: 9894038926

పోయారు'' అంది విజయలక్ష్మి నవ్వుతూ.

''ఆయనంటే మగాయన పైగా ఆఫీసరు. నెలకు పదివేల ఆదాయం. నువ్వు సంపాదించే పదిహేను వందల కోసం ఒక్కదానివీ–'' చిన్నకొడుకు ప్రసాద్ మాటలు పూర్తి కాకుండానే, 'ప్రసాదూ' అని విజయలక్ష్మి ఒక్క అరుపు అరిచింది.

''జీతం ఎంతైనా నా ఉద్యోగం నాకు గొప్ప. నా ఉద్యోగం నేను వదలను. బతి కున్నంత కాలం ఆయన ఇదే పాట పాడిపాడి వెళ్లాడు. ఇప్పుడు మీరు అందుకు న్నారా? నేనెక్కడికీ రాను. ఎవరిదగ్గరా ఉండను నా ఉద్యోగం వదలను. రిటైర య్యాక ట్యూషన్లు చెప్పుకుంటాను. ఓపిక లేని రోజు, పనులు నేను చేసుకోలేని రోజు చావనన్నా చస్తానుగానీ, ఎవరిచేతా చాకిరీ చేయించుకోను. ఎవరి మీదా ఆధార పడను''.

భర్త చచ్చిపోయిన రోజు ఎంత ఏడుపు ఏడ్చిందో మళ్ళీ అంత ఏడుపు ఏడ్చింది ఆమె.

కొడుకులూ, కోడళ్ళూ ముఖాలు మాడ్చుకున్నారు.

''ఆవిడ మనసు బాగా లేదులెండి'' గంగాధరం సర్దిచెప్పబోయాడు.

''మేం కానిమాట ఏమన్నామండీ. కొడుకుల మీద ఆధారపడటం పరువు తక్కువా? అంత అఘాయిత్యం మాటలు మాట్లాడటం దేనికి?'' నిష్ఠూరంగా మాట్లాడారు.

వాళ్ళబాధ వాళ్ళది. కానీ, మారుతున్న కాలానికి, విలువలకీ ప్రత్యేకంగా వ్యక్తుల బాధ పట్టించుకోవాల్సిన అవసరం ఉండదు. తనను నడిపించే సూత్రా లను పట్టుకుని పరిగెత్తటమే వాటికి తెలుసు. ఆ సూత్రాలేవో తెలుసుకున్న మను షులు శాంతిగా బతక గలుగుతారు. తెలుసుకోలేని వాళ్ళు అశాంతి పడక తప్పదు.

విజయలక్ష్మి కొడుకులు ఆమె మీద కోపంతోనే వెళ్ళిపోయారు.

''మీరు మరీ ఎక్కువ రియాక్టయ్యారండీ, పాపం వాళ్ళు మాత్రం ఏమన్నా రనీ?'' నాలుగు రోజుల తర్వాత మళ్ళీ ఆ ప్రస్తావన తీసుకొచ్చాడు గంగాధరం.

''నా ఉద్యోగాన్ని అన్నారండి. ఆయన నాకంటే పది రెట్లు ఎక్కువ సంపాదించే వాడు. నిజమే, ఆయన చదివిన చదువు అలాంటిది. ఇప్పుడు నా కొడుకులిద్దరూ నా కంటే ఎక్కువే సంపాదిస్తున్నారు. నిజమే కానీ, నాకు ధైర్యాన్నిచ్చేది నా ఉద్యో గమేనండి, వాళ్ళ ఉద్యోగాలు కాదు. ఆయన కూడా అంతే. ఇంట్లో ఏ చిన్నచికాకు వచ్చినా, బోడి ఉద్యోగం మానెయ్యమనే వాడు. నా ఉద్యోగాన్ని మానకుండా ఉండటానికీ, నా ఉద్యోగాన్ని ఆయన తిట్లనుంచి రక్షించుకోటానికి నేనెంత శక్తి ధార పోశానో ఎవరికీ తెలియదు'' విజయలక్ష్మి కళ్ళు మళ్ళీ నిండాయి.

గంగాధరం ''అయ్యయ్యో – మీరు మళ్ళీ బాధపడుతున్నారు'' అంటూ కంగారు పడ్డాడు.

''పైగా, మీరు మగాళ్ళు కాబట్టి ఒంటరిగా ఉండగలరు అన్నారు చూశారా. నిజానికి మనిద్దరి జీవితాలు చూస్తే నేనే ధైర్యంగా, నిశ్చింతగా ఉన్నానని నా కని పిస్తోంది.''

''నిజం. నేను పడుతున్న నరకం వాళ్ళకు తెలియదు. ఎందుకిట్లా బతకాలో తెలియదు. ఇట్లాకాకుండా పిల్లల దగ్గరకెళ్ళటం ఇష్టమూ లేదు. సుశీల నన్ను చాలా కష్టాల్లో పడేసి వెళ్ళింది. పాపం, తనకూ తెలిసి ఉండదు. లేకపోతే ఈ కష్టాలు తప్పించుకునే ఉపాయం కూడా తనే చూసిపెట్టి ఉండేది'' ఈసారి కన్నీళ్ళు పెట్టుకో వడం గంగాధరం వంతయింది.

విజయలక్ష్మి గంగాధరాన్ని ఓదార్చి సంభాషణ మళ్ళించింది.

'మొత్తానికి రాఘవరావు కంటే నేనే నయం. సుశీలను ఎన్నడూ ఉద్యోగం మానమన లేదు. ఆమె ఉద్యోగాన్ని హేళన చేయలేదు' అనుకున్నాడు గంగాధరం ఆరోజు రాత్రి నిద్రపోబోతూ. అందువల్ల విజయలక్ష్మితో తనకేదో దగ్గరితనం వచ్చి నట్లనిపించి కాస్త ఆనందంగా నిద్ర పోయాడు.

మరో రెండు నెలలు గడిచి పోయాయి. ఇద్దరి మధ్యా స్నేహమూ పెరిగింది. ఒక రోజు రాత్రి విజయలక్ష్మి పెట్టిన భోజనం తృప్తిగా తిని వక్కపొడి నములుతూ – ''మనం ఇద్దరం ఒంటరిగా ఉంటున్నాం. ఎందుకట్లా ఉండాలి? పెళ్ళి చేసుకుని కలిసి ఉంటే'' అన్నాడు తన జీవితంలో అతి పెద్ద సాహసకార్యం చేస్తున్నానని అనుకుంటూనే.

విజయలక్ష్మి ఒకే ఒక్కక్షణం ఆశ్చర్య పోయి, ఆ తర్వాత ఆపకుండా ఐదు నిమిషాలు నవ్వింది.

గంగాధరం ముఖం చెక్కుతీసిన బీట్‌రూట్ దుంప అయింది. నవ్వి నవ్వి కళ్ళ నీళ్ళు తుడుచుకుంటూ గంగాధరం వంక చూసి అంత నవ్వినందుకు కించిత్తు పశ్చాత్తాప పడింది.

గంగాధరం అక్కడ నుంచి లేచి వెళ్ళడానికి కూడా శక్తిలేనివాడై అలాగే కూర్చున్నాడు.

విజయలక్ష్మికి జాలేసింది. అతని బాధను తగ్గించాలనుకుంది.

''సారీ మిమ్మల్ని బాధ పెట్టాననుకోండి. మీ ఆలోచన గురించి నాకు ఎగతాళి లేదు. ఆ మాట మీరు నమ్మి తీరాలి. నేను నవ్వింది మీరలా అడిగారని కాదు. మీరన్నారే ఒంటరి వాళ్ళమని – నేను ఒంటరిదాన్నని అనుకోవటం లేదు. ఒంటరితనం నుంచి బయట పడ్డాననుకుంటున్నాను. అంతెందుకు, ఇంతకుముందు నాకు మీలాంటి స్నేహితులతో మాట్లాడే అవకాశం ఉండేది కాదు. సంగీతంతో పరిచయం చేసుకునే వీలు లేదు. అంతకు ముందు నా ఆలోచనల్నీ, అభిరుచుల్నీ దాచేసుకుని ఒంటరిగా బతికానేమో గాని ఇప్పుడలా కాదు''.

గంగాధరానికి అతనున్న పరిస్థితిలో ఆమె మాటలు సరిగా అర్థం కూడా కాలేదు. ఎలాగో శక్తి తెచ్చుకుని వెళ్ళడానికి లేచాడు.

''కూచోండి. కూచోండి. మీ ఐడియా గురించి మాట్లాడదాం'' విజయలక్ష్మి కూచో బెట్టింది.

''మీరు కేవలం నన్ను ఆడదానిగా మాత్రమే చూసి పెళ్లి ప్రస్తావన తెచ్చారని అనుకోవడం లేదు. అది కరక్టేనా?''

''కరక్టే – కరక్టే. నాకసలు ఆ ఉద్దేశం లేదు. కేవలం ఒక తోడు....'' హడావిడిగా జావాబిచ్చాడు.


''ఆతోడు మీకెందుకు కావాలో నాకు సరిగ్గా అందుకే అక్కర్లేదు'' అర్థం కానట్టు చూశాడు.

''నేను చెప్పాను గదా. ఈ వయసులో నాకోసం నేను బతకాలని ఉంది గానీ, మరెవరి కోసమో ఎడ్జెస్టవుతూ బతకాలని లేదు. మీకు సేవలు చేస్తూ బతకాలని అసలు లేదు''.

''సేవలు ....'' గంగాధరం అయోమయంగా చూశాడు.

''సేవలే. మగవాళ్లకు తోడంటే సేవలే అని నా ఉద్దేశం, మీ ఇల్లు చూస్తుంటే మీకే రకం సేవలు కావాలో తెలుస్తూనే ఉంది''.

గంగాధరం ఒక పది నిమిషాలు ఆలోచిస్తూ కూచుని హఠాత్తుగా లేచి వెళ్ళిపోయాడు.




ఆ రాత్రంతా గంగాధరానికి నిద్ర పట్టలేదు. ఎంత ఆలోచించినా విజయలక్ష్మి మాటల్లో తప్పు కనిపించలేదు.

'విజయలక్ష్మి తన ఇల్లు చక్కబెట్టి, తనకు వండిపెట్టి, తన మంచి చెడ్డలు చూడాలని గాక ఎందుకు పెళ్లి చేసుకోవాలనుకున్నాడు. ఎవరైనా ఎందుకు పెళ్లి చేసుకోవాలనుకుంటారు? అందుకేగా – ఆ సేవలు చెయ్యనంది విజయలక్ష్మి. ఏ ఆడదైనా ఎందుకు చెయ్యాలి? తనకు కావలసింది మంచి పని మనిషా? మంచి తోడా?' తన ఆలోచనా తప్పనిపించదు. విజయలక్ష్మిది తప్పనిపించదు. తెల్లవారు ఝామున ఎప్పుడో నిద్ర పోయాడు.

మర్నాడు గంగాధరం వాళ్లింట్లో పనిచేసే రేణుక పదిసార్లు విజయలక్ష్మి వాళ్లింటికి తిరిగి చీపుర్లు, బూజుకర్ర, ఫినాయిలు ఇత్యాది వస్తువులన్నీ పట్టుకెళ్ళింది. ఆ రోజు గంగాధరం ఆఫీసుకి వెళ్లలేదు,

సాయంత్రం విజయలక్ష్మి దగ్గరకు వెళ్లకుండా బజారు వెళ్లి ఏవేవో కొనుక్కొచ్చాడు.

నాలుగు రోజులు గంగాధరం రాకపోయే సరికి విజయలక్ష్మి ఆశ్చర్యపోయింది. ఐదో రోజు గంగాధరం ఇంటి తలుపు తట్టింది.

లోపలకు వెళ్లి చూస్తే ఇల్లంతా మారిపోయింది. శుభ్రంగా ఏ వస్తువు ఎక్కడుండాలో అక్కడుంది.

గంగాధరం వంట చేసుకుంటున్నాడు. విజయలక్ష్మితో ''ఇవాళ మీ భోజనం మా ఇంట్లో'' అని చెప్పేశాడు.

''నా వంట మీకు ఎలా ఉంటుందో, ఎన్ని వంకలు పెడతారో'' అంటూనే వడ్డించాడు.

''ఫరవాలేదు. బాగుంది'' అంటూనే చిన్న చిన్న సలహాలిచ్చింది విజయలక్ష్మి.

ఆ తర్వాత నుంచీ రెండు రోజులు విజయలక్ష్మి ఇంట్లో గంగాధరం భోజనం చేస్తే, రెండు రోజులు గంగాధరం ఇంట్లో విజయలక్ష్మి భోజనం చేసేది.

రెండు రోజులు ఇద్దరూ బయట ఏ హోటల్లోనే తినేసేవారు. ఆదివారం నాడు ఇద్దరూ కలిసి వంట చేసుకుని సరదాగా కాలక్షేపం చేసేవారు.

మరో ఆరు నెలలు ఇలా గడిచిపోయాయి.

గంగాధరం కూతురికి కొడుకు పుట్టాడు. ఆ పిల్లకిదే మొదటి కాన్పు. టెలిగ్రాం చూడగానే గంగాధరం సంబరం సంబరం కాదు. తాతనయ్యానంటూ తెగ మురిసిపోయాడు.

విజయలక్ష్మిని తీసుకుని బజారువెళ్లి మనవడికి బట్టలూ బంగారుగొలుసూ ఏవేవో కొన్నాడు. కూతురి దగ్గరకు ప్రయాణం కట్టాడు. కూతురి స్నానం అదీ అయ్యేవరకు అక్కడే ఉండి మనవడికి తన పేరు పెడతానంటే వద్దంటే వద్దని 'సుశీల్' అని భార్య పేరు పెట్టించాడు. పదిహేను రోజుల సెలవు ఆనందంగా గడిపేశాడు. ఆ విశేషాలన్ని ఎప్పుడెప్పుడూ విజయలక్ష్మికి చెబుదామా అని ఉంది గంగాధరానికి. రైల్లో అంతా మనవడి గురించి విజయలక్ష్మికి ముఖ్యంగా చెప్పాల్సిన విషయాలు మరిచిపోతా నేమోనని మథనపడి పోయి, చివరకి జేబులో డైరీ తీసి నోట్ చేసుకున్నాడు. 'తీరా తను వెళ్లేసరికి విజయలక్ష్మి ఉండదు. స్కూలుకి పోతుంది. సాయంత్రం దాకా ఆగాలి. సాయంత్రం సరాసరి వస్తుందో, ఏ పాట కచ్చేరి కన్నా పోతుందో' అనుకుంటూ వచ్చాడు.

విజయలక్ష్మి ఇంటికి తాళం లేదు.

గంగాధరం తన ఇంటికి వెళ్లకుండానే విజయలక్ష్మి ఇంటి తలుపు కొట్టాడు.

విజయలక్ష్మి తలుపుతీసి గంగాధరాన్ని చూసి చేటంత ముఖం చేసుకుంది.

''అదేంటి అలా చిక్కిపోయారు.'' అన్నాడు గంగాధరం ఆశ్చర్యపోతూ.

''నన్ను ఒంటరిగా వదిలి వెళ్లారుగా. దిగులుతో చిక్కిపోయాను నిజం. మీరెళ్లినప్పటి నుంచి ఒక్కదానికీ ముద్ద దిగటం లేదు. నిద్రా పట్టి చావదు. ఇదేంటి ఇలా చేశారు?''

విజయలక్ష్మి మాటలు అర్థం కావడానికి గంగాధరానికి పూర్తిగా ఐదునిమిషాలు పట్టింది. ఈ లోపల విజయలక్ష్మి కాఫీ తెచ్చింది. కాఫీ కప్పు తీసుకుని టేబిల్ మీద పెట్టి, ఆమె చేతులు పట్టుకున్నాడు.

''నిజంగా మీరన్న మాటలు నిజమేనా? ఒంటరిగా ఫీలయ్యారా?''

''నిజమే. ఒట్టు'' నవ్వింది మనోహరంగా.

గంగాధరానికి సంతోషంతో మతిపోయి, విజయలక్ష్మిని కౌగిలించుకున్నాడు.

★